సాక్షి
అనకాపల్లి
సోమవారం । 25 । నవంబర్ । 2024



ఎడ్ల బళ్ల పోటీల విజేత కేజేపురం

మామిడిపల్లిలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీల్లో కేజేపురానికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో విజేతగా నిలిచాయి. 8లో

బండిమాంబ... నమో..నమః



ఏటికొప్పాకలో బండిమాంబ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పునుపు, కుంకుమలు సమర్పించారు. 8లో



2 నుంచి మార్గశిర మాసోత్సవాలు

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో డిసెంబర్ 2 నుంచి 30వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలను నిర్వహించనున్నారు. 8లో

న్యూస్‌రీల్

అంధ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



నూతన కార్యవర్గంతో రాష్ట్ర నాయకులు

అనకాపల్లి: అంధ ఉద్యోగుల అసోసియేషన్ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల సంయుక్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో ఆదివారం ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా కొరుప్రోలు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పల్లా పోతురాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గొల్లవిల్లి సురేష్ కుమార్, మహిళా కార్యదర్శిగా గరికపాటి గౌతమి, కోశాధికారిగా కాట్రపల్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా పరిశెట్టి అప్పారావు, ఎస్.నాగమణి, సహాయ కార్యదర్శులుగా ఎం.అనురాధ, శివశంకర్, అనకాపల్లి, అల్లూరి జిల్లాల అసోసియేట్‌అధ్యక్షుడిగా కోన బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా వెంకటేశ్వరరావు, బమ్మిడి రమణ, ఆలీలు వ్యవహరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంధ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రబాబు, రాష్ట్ర నాయకులు దాసరి సింహాచలం, కిమిడి కాసులమ్మ, ఎల్.బుజ్జి, వి.అప్పారావు, గోకాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్‌లో 2,50,000 మార్కుదాటిన రాంబాబు



ధ్రువీకరణ పత్రం స్వీకరిస్తున్న రాంబాబు

రోలుగుంట: మండలంలోని కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న అప్పన రాంబాబు మైగవర్నమెంటు క్విజ్ ఆన్‌లైన్ పోటీల్లో 2,50,000 మార్కు దాటారు. వికసిత్ భారత్, ఆజాదీకా అమృత మహోత్సవం, స్వచ్ఛభారత్, బేటీ బచావ్, బేటీ పఢావో, వీరగాథ, ఎన్నికలు,నేషనల్ లీడర్స్, వారసత్వ ప్రదేశాలు తదితర ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొని 2,50,000 మార్కును దాటి, ఎన్‌సీఈఆర్టీ నుంచి సర్టిఫికెటు పొందారు.

ధరణి పుత్రులపై
ధరల పిడుగు

అన్ని వర్గాల ప్రజలపై కూటమి ప్రభుత్వం తన ప్రతాపం చూపుతోంది. పేద, మధ్య తరగతి ప్రజలకు బతుకులు భారంగా మారాయి. తాజాగా అన్నదాతలపై ధరల పిడుగు పడింది. ఎరువుల ధరలు విపరీతంగా పెంచేశారు. 50 కిలోల బస్తాకు రూ.100 వరకు పెరగడంతో ఏం చేయాలో పాలుపోక రైతన్నలు దిగులు చెందుతున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో ఎటువంటి పెట్టుబడి సాయం అందకపోవడంతో అప్పుల పాలైన రైతులపై అదనపు భారం పడడం మరింత కుంగదీసింది. ఎరువుల ధరల పెరుగుదల కారణంగా జిల్లాలోని అన్నదాతలపై రూ.10 కోట్ల అదనపు భారం పడుతోంది.



యలమంచిలి పెంజీరుపు ఆయకట్టు భూముల్లో వరిపంటకు ఎరువు వేస్తున్న రైతు (ఫైల్)

- భారీగా పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు
- బస్తాకు రూ.100 వరకు పెంపు
- జిల్లా రైతాంగంపై ఏడాదికి రూ.10 కోట్ల అదనపు భారం
- పెరగనున్న పెట్టుబడి వ్యయం

ప్రస్తుతం ఎరువుల ధరలు

50 కిలోల బస్తా ధర (రూపాయల్లో)	
20-20-013	1,300
డీఏపీ	1,350
14-35-14	1,800
28-28-0	1,700
పొటాష్(ఎంఓపీ)	1,500
10-26-26	1470
అమ్మోనియం సల్ఫేట్	9,25
15-15-15 ప్యాక్ట్	1,250
24-24-0	1,800
యూరియా(45 కిలోల బస్తా)	266
16-16-16	1,375
12-32-16	1,470

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల వంటలు కలిపి సుమారు 64,101 హెక్టార్లలో సాగు చేస్తుంటారు.ఈ వంటల కోసం సుమారు 35,353 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తారు.రబీ సీజన్‌లో వంటల సాగు విస్తీర్ణం 16,011 హెక్టార్లుగా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. వీటి సాగు నిమిత్తం సుమారు 15,924 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయి. మొత్తంగా ఏడాదికి రెండు సీజన్లలో 51,364 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను రైతులు వినియోగిస్తారు.ఈ లెక్కన పెరిగిన ఎరువుల ధరలతో జిల్లా రైతాంగంపై ఏడాదికి సుమారు రూ.10 కోట్లకు పైగా అదనపు భారం పడనుంది.జిల్లాలో పంటల **సాగులో** వరిదే అగ్రస్థానం. ఎకరా వరికి ఒక బస్తా **డీఏపీ,**రెండు బస్తాల కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తారు. కూలీ రేట్లు,విత్తనాలు,ఎరువులు, పురుగు మందుల ధరలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి.ఆ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ ధరలు పెరగడంలేదు. ప్రధానంగా రసాయన ఎరువుల ధరలు భారీగా పెరగడంతో తమపై అదనపు భారం పడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.కూటమి ప్రభుత్వం స్పందించి ఎరువుల ధరలు తగ్గించడంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రూ.10 కోట్ల అదనపు భారం

యలమంచిలి రూరల్: జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు కీలక దశలో ఉన్నాయి..కొన్ని ప్రాంతాల్లో రబీ సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్న వేళ ఎరువుల ధరల రూపంలో అదనపు భారం పడింది.ఇప్పటికే సాగు పెట్టుబడి వ్యయం పెరిగి..పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు అప్పుల పాలవుతున్నారు. రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరిస్తున్నాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు పెట్టుబడి సాయం కింద పైసా కూడా అందించలేదు. తాము అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల ముందు నమ్మబలికారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే ఐదు నెలలు పూర్తయింది.కానీ ఆదుకున్నపాపాన పోలేదు.ఈ నేపథ్యంలో ఎరువుల ధరలు భారీగా పెరగడంతో వారిపై మరింత భారం పడింది. జిల్లాలో రైతులు ఎక్కువగా వినియోగించే కాంప్లెక్స్ ఎరువులు రకాన్ని బట్టి 50 కిలోల బస్తాకు రూ.100 వరకు పెరగడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఎరువుల ఉత్పత్తికి వినియోగించే ముడి పదార్థాల ధరలు పెరిగిపోవడంతో ఎరువుల ధరలు పెరిగినట్టు డీలర్లు చెబుతున్నారు.దీంతో పంటల సాగు ఖర్చు ఎకరాకు రూ.3 వేల వరకు పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు రకాల ధరలు పెంపు

సాగులో ఎక్కువగా వినియోగించే మూడు రకాల ఎరువుల ధరలను ఉత్పత్తి కంపెనీలు పెంచి అన్నదాతలపై భారం మోపాయి.యూరియా మినహా రైతులు ఎక్కువగా వాడే 20-20-013, 14-35-14, 24-24-0 కాంప్లెక్స్ రకాల ఎరువుల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. మొన్నటివరకు 20-20-013 కాంప్లెక్స్ ఎరువు బస్తా రూ.1,200 ఉండగా ప్రస్తుతం రూ.1,300కు చేరింది.14-35-14 బస్తా ధర రూ.1,700 ఉండేది..ఇప్పుడది రూ.1,800 కు చేరింది.24-24-0 ధర రూ.1,700 నుంచి రూ.1,800 కు పెరిగింది.డీఏపీ ధర పెరిగిందని ఇటీవల కొన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగినా ప్రస్తుతానికి ఎటువంటి మార్పు లేదని డీలర్లు చెబుతున్నారు. ఇప్పుడు డీఏపీ బస్తా ధర రూ.1,350గా ఉంది.త్వరలోనే ఈ ధర కూడా పెరిగే అవకాశం లేకపోలేదని కొందరు డీలర్లు చెబుతున్నారు.

డాలర్ విలువ పెరగడంతో..

ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ విలువ పెరిగి... రూపాయి విలువ పతనమవడంతో ఆ ప్రభావం ఎరువుల తయారీకి వాడే ఫాస్పారిక్ ఆమ్లం, అమ్మోనియా లాంటి ముడి సరుకులపై పడింది.అందువల్లే కొన్నిరకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచామని సంబంధిత కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.గత సెప్టెంబర్ వరకు అంతర్జా

ఎరువుల ధరలు బాగా పెరిగాయి



కాంప్లెక్స్ ఎరువుల ధరలు బాగా పెరిగాయి.గతంలో ఎప్పుడూ ఒకేసారి ఇలా పెరగలేదు.పురుగు మందుల ధరలు కూడా పెరుగుతున్నాయి.దుక్కి దున్నింది మొదలు అన్ని రకాల ఖర్చులు పెరిగాయి.దీంతో ఎకరానికి గతంలో కంటే రూ.2,500 నుంచి రూ.3,000 వరకు రైతులపై భారం పడుతోంది.పెరిగిన ఎరువుల ధరలపై పునరాలోచించి ధరలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– మొగిలి నర్సింగరావు,రైతు,పీఎస్ఆర్‌పేట, యలమంచిలి మండలం

వ్యవసాయం ఎలా చేయాలి



మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది రైతుల పరిస్థితి. పెట్టుబడి ఖర్చులతో వ్యవసాయం భారంగా మారిన తరుణంలో ఇలా ఎరువుల ధరలు పెంచడం దారుణం. వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంది.ఎరువుల ధరలకు రెక్కలు రావడంతో మా ప్రాంతంలో రైతులందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోతే అప్పుల పాలుకాక తప్పదు.

– పందల వరలక్ష్మి,రైతు,గోకివాడ, రాంబిల్లి మండలం

ధరలు నియంత్రించాలి



ప్రభుత్వాలు రైతుల పరిస్థితిని పట్టించుకోకుండా తరచూ ఎరువుల ధరలు పెంచడం చాలా దారుణం.రైతులు సాగు చేస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైన ప్రభుత్వాలు ఇష్టానుసారంగా ఎరువుల ధరలు పెంచడం సరికాదు.రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– కాళ్ల శ్రీనివాసరావు, రైతు,పోతురెడ్డిపాలెం, యలమంచిలి మండలం

మోయలేని భారం



అసలే సాగు పెట్టుబడులు పెరిగి వ్యవసాయం అంటేనే భయపడుతున్న తరుణంలో ఎరువుల ధరలు పెంచడం దారుణం.వీటిని నియంత్రించాలి. పెరిగిన ధరలతో సాగు చేయాలంటేనే రైతులు భయపడే పరిస్థితి వచ్చింది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పెరిగిన ఎరువుల ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

– కర్రి అప్పారావు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు

ప్రధాని పర్యటనకు
పకడ్బందీ ఏర్పాట్లు

- 29న ఏయూ మైదానంలో బహిరంగ సభ, రోడ్‌షో
- వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని

మహారాణిపేట(విశాఖ): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 29వ తేదీన విశాఖ పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ, రోడ్ షో గురించి ఎంపీ ఎం.శ్రీభరత్, ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజు, వంచకర్ల రమేష్ బాబు, అధికారులతో చర్చించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వీఐపీల రాక, ప్రధాన మంత్రికి స్వాగతం ఏర్పాట్లు, ప్రజలకు తాగునీరు, ఆహారం, ఇతర వసతుల కల్పన తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, డీసీపీలు, ఇతర రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఇలా..

ప్రధాని మోదీ ఈ నెల 29వ తేదీ సాయంత్రం 3.40 గంటలకు ప్రత్యేక విమానంలో తూర్పు నౌకాదళానికి చెందిన ఎయిర్‌బేస్ ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో కాన్వెంట్ జంక్షన్, రైల్వే స్టేషన్, సంపత్ వినాయక్ టెంపుల్, టైకూన్, సిరిపురం జంక్షన్ మీదుగా ఎస్పీ బంగ్లా రోడ్డు నుంచి వేదిక వద్దకు 4.40 గంటలకు వస్తారు. ఈ క్రమంలో టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు రోడ్‌షోలో పాల్గొంటారు. ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఏయూ మైదానంలో బహిరంగ సభకు చేరుకుంటారు. బహిరంగ సభలో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో కలిసి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుతో పాటు, రైల్వే లైన్లు, మొదలైన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్ని ప్రధాని చేయనున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ప్రసంగాల అనంతరం సాయంత్రం 5.25 నుంచి 5.43 గంటల వరకు ప్రజలనుద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు. సాయంత్రం 5.45 గంటలకు సభా వేదిక నుంచి ఎయిర్ పోర్టుకు తిరుగుపయనమవుతారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకోనున్నారు.

అడిగినంత ఇస్తేనే.. ఆధార్ మార్పులు

గొలుగొండ మండలం జమ్మదేవిపేటకు చెందిన విద్యార్థినికి పాఠశాలలో అపార్ సంఖ్య నమోదుకు ప్రయత్నించగా ఆధార్‌లో పుట్టిన తేదీ తప్పుగా ఉండడంతో సాధ్యం కాలేదు. దీంతో ఆమె తండ్రి గంగరాజు పుట్టిన తేదీ మార్పు కోసం నర్సీపట్నంలోని ఓ ఆధార్ కేంద్రం వద్దకు మూడు రోజుల కిందట వెళ్లి తప్పును సరిచేయాలని కోరారు. దరఖాస్తు తీసుకున్న నిర్వాహకుడు టోకెన్ నంబర్ ఇచ్చి 20 రోజుల తరువాత రమ్మన్నాడు. అత్యవసరం కావడంతో మళ్లీ శనివారం వెళ్లి నిర్వాహకుడు డిమాండ్ చేసిన రూ.350 చెల్లించాడు. దీంతో గంటలోగా ఇచ్చేందుకు నిర్వాహకుడు అంగీకరించాడు. ఇక్కడే కాకుండా మరో రెండు కేంద్రాల్లో కూడా విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

- కేంద్రాల్లో వసూళ్ల దందా
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థుల పడిగాపులు

ప్రభుత్వం నిర్ణయించిన ధరలు

- కొత్తగా ఆధార్ నమోదు ఉచితంగా చేయాలి.
- బయోమెట్రిక్ అప్‌టుడేట్, 5-7, 15-17 ఏళ్ల మధ్య వయసు వారికి ఉచితంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- మిగిలిన వారికి రూ.100 రుసుం నిర్ణయించింది.
- డెమోగ్రాఫిక్ అప్‌టుడేట్(పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఫోన్ నంబరు ఇతర వివరాలకు రూ.50 తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

నర్సీపట్నం:ఆధార్ కేంద్రాల్లో వసూళ్ల దందా జోరుగా సాగుతోంది. ప్రస్తుతం 9, 10 తరగతులు, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అపార్(ఆటోమేటిక్ పర్మినెంట్ అకౌంట్ రిజిస్టర్) నమోదు ప్రక్రియ చేపట్టారు. కొందరు విద్యార్థులకు ఆధార్, పాఠశాల రికార్డుల్లో నమోదైన వివరాలు సరిపోలక పోవడంతో అపార్ నమోదు సాధ్యం కావడం లేదు. దీంతో అత్యవసరంగా ఆధార్ సవరణలు చేయించుకోవాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా ఆధార్ కేంద్రాల నిర్వాహకులు కాసుల వేట మొదలు పెట్టారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌బీఐ(ఏడీబీ) బ్రాంచ్, ఆంధ్రాబ్యాంక్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలతో పాటు నాలుగు సచివాలయాల్లో కలిపి ఏడు ఆధార్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే వీటిలో ఐదు కేంద్రాలు పనిచేస్తున్నాయి. దీంతో ఎస్‌బీఐ(ఏడీబీ) బ్రాంచ్, ఆంధ్రాబ్యాంక్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో గల కేంద్రాలకు డిమాండ్ పెరిగింది. తమ అవసరాలను ఆసరాగా చేసుకున్న కేంద్రాల నిర్వాహకులు అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని ఆధార్ కేంద్రాలకు వచ్చే ప్రజలు ఆరోపిస్తున్నారు. కేంద్ర విద్యామంత్రిత్వశాఖ విద్యార్థులందరికీ అపార్ నమోదు తప్పనిసరి చేసింది. దీంతో సవరణలు చేసుకునేందుకు విద్యార్థులువస్తుండడంతో ఆధార్ నమోదు కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. ఏడీబీ, ఆంధ్రాబ్యాంక్, బీఎస్ఎన్ఎల్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అధిక రుసుము వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బయోమెట్రిక్, డెమెగ్రాఫిక్ వివరాలను ఒకేసారి అప్‌టుడేట్ చేయించుకుంటే కేవలంరూ.100 చెల్లిస్తే సరిపోతుంది. క్రమ పద్ధతిలో అప్‌టుడేట్ చేయాలంటే నెల రోజుల సమయం పడుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే రూ.300 నుంచి రూ.500 ఇస్తే గంటల్లో ఆధార్ అప్ టు డేట్ అవుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు బహిరంగంగానే చెబుతున్నారు. లేదంటే రోజుల తరబడి కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కేంద్రాలకు వచ్చే ప్రజలను నిర్వాహకులు దోచుకుంటున్నారు.

అధిక వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఆధార్ కేంద్రం నిర్వాహకులు వసూళ్లకు పాల్పడితే కేంద్రాల లైసెన్స్ రద్దు చేస్తాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలి. నిర్ణీత రుసుం కంటే అధికంగా వసూలు చేస్తే ఉపేక్షించేది లేదు.

– వి.వి. రమణ, ఆర్డీవో, నర్సీపట్నం

టీడీపీ సానుభూతిపరుల బరితెగింపు





కొత్తనాగయ్యపేటలో ధ్వంసం చేసిన సీసీ రోడ్డు (ఇన్‌సెట్)ముక్కలైన మంచినీటి పైపులైన్

- కొత్తనాగయ్యపేటలో పైపులైన్, సీసీ రోడ్డు ధ్వంసం
- సర్పంచ్ ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- తాగునీరు సరఫరా కాక అవస్థలు

దేవరాపల్లి: టీడీపీ నాయకులు, సానుభూతిపరులు రెచ్చిపోతున్నారు. తాము ఏం చేసినా అడిగేవాడే లేడు అన్న ధైర్యంతో బరితెగిస్తున్నారు. మండలంలోని నాగయ్యపేట పంచాయతీ పరిధిలోని కొత్త నాగయ్యపేటలో స్థానిక టీడీపీ సానుభూతిపరులు కొందరు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంక్‌కు చెందిన పైపులైన్‌ను పొక్లెయిన్‌తో పూర్తిగా ధ్వంసం చేశారు. దీంతో వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఇది జరిగి వారం రోజులు కావస్తున్నా సంబంధిత గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇదే విషయమై స్థానిక సర్పంచ్ కర్రి పుష్ప లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. గ్రామానికి చెందిన అల్లు దేముడు, అల్లు దేముడమ్మ, అల్లు గంగునాయుడు తదితరులు పొక్లెయిన్‌తో పైపులైన్ ధ్వంసం చేశారని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అల్లు గంగునాయుడు సూచనలతోనే పైపులైన్ ధ్వంసం చేశారని, ఈ విషయమై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

నామరూపాల్లేకుండా...

గ్రామంలో రామాలయానికి ఆనుకుని ఉన్న సీసీ రోడ్డును సైతం ధ్వంసం చేశారు. 50 మీటర్లమేర నామరూపాలు లేకుండా చేశారు. రోడ్డును పెచ్చుపెచ్చులుగా చేయడంతో రాకపోకలకు గ్రామస్తులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన రోడ్డును ధ్వంసం చేసినా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికార్లు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం సరి కాదంటూ విమర్శిస్తున్నారు. ధ్వంసంచేసిన వారు టీడీపీ సానుభూతిపరులు కావడంతోనే చర్యలు తీసుకునేందుకు అధికారులు భయపడుతున్నారని స్థానికులు తెలిపారు.

కుళాయి నీరు రాక అవస్థలు



మంచినీటి ట్యాంక్ పైపులను కొంత మంది ధ్వంసం చేశారు. దీంతో సుమారు వారం రోజులుగా కుళాయి నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇంటింటా కుళాయిలు ఉన్నా చేతి బోర్ల నుంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దౌర్జన్యంగా పైపులైన్ ధ్వంసం చేసి వారం రోజులు కావస్తున్నా, అధికార్లు పట్టించుకోక పోవడం దారుణం.

– కడారి మంగ కొత్త నాగయ్యపేట గ్రామం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



రామాలయానికి ఆనుకుని ఉన్నవీధిలో సీసీరోడ్డును కొందరు పొక్లెయిన్‌తో పూర్తిగా తవ్వేశారు. సిమెంట్ కాంక్రీట్ పెచ్చులు పైకి తేలాయి. ప్రభుత్వ నిధులతో నిర్మించిన రోడ్డును దౌర్జన్యంగా తవ్వేస్తే అధికార్లు పట్టించుకోక పోవడం దారుణం. ఇలాంటి విష సంస్కృతి గ్రామంలో ఎన్నడూ లేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– తమటపు శంభునాయుడు, కొత్త నాగయ్యపేట.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

కొమ్మాది(విశాఖ): బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు రెండోరోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. రుషికొండ గాయత్రీ పీజీ, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పోటీలను ఎస్టీకమిషన్ చైర్మన్ డా.వి.జి.శంకర్రావు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్(టీసీఆర్‌టీఎం) భవన్ ప్రాంగణంలోని గిరిజన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన 24 స్టాళ్లను పరిశీలించారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి మందా పాల్గొన్నారు.

కారు చిచ్చు

ఏటికొప్పాకలో పాలసేకరణ కేంద్రం వద్ద ఆదివారం మధ్యాహ్నం నిలిపి ఉంచిన కారు దగ్ధమైంది. బండిమాంబ అమ్మవారి జాతరకు గాజువాక నుంచి వచ్చిన ఓ కుటుంబానికి చెందిన కారులో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. స్వల్పంగా పేలుళ్లు సంభవించినట్టు స్థానికులు తెలిపారు. యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.కారు యజమానితో మాట్లాడి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. ఈ కారును 6 నెలల క్రితమే కొనుగోలు చేసినట్టు,దాని విలువ సుమారు 15 లక్షలుగా తెలిపారు. ప్రమాద సమయంలో దట్టమైన పొగ, పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో స్థానికులు, భయాందోళనకు గురయ్యారు. – యలమంచిలి రూరల్



సీకారు



రేవుపోలవరం తీరానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. అధిక సంఖ్యలో తరలిరావడంతో రద్దీ వాతావరణం ఏర్పడింది. ఇసుక తిన్నెల్లో ఉదయం నుంచి విహరించి, తీరంలో జలకాలాడుతూ సందడి చేశారు. సమీప జెట్టీపైకి ఎక్కి సంద్రం అందాలను వీక్షించి, ఫొటోలు, సెల్ఫీలు దిగారు. తీరం సమీపంలోని తోటల్లో వన భోజనాలు చేసి, లక్ష్మీమాధవ స్వామి, మినీ కైలాస్ గిరిపై గౌరీ పరమేశ్వరులను, షిరిడీ సాయి నాథుని దర్శించుకున్నారు.

– ఎస్.రాయవరం

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్టింజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. సింహగిరీశునికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విద్యావ్యవస్థను ప్రయోగశాల చేయొద్దు...



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్

అనకాపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థను ఏపీ ప్రభుత్వం ప్రయోగశాలగా మారుస్తుందని, సిలబస్‌ను వారి ఇష్టం వచ్చినట్టు మారుస్తూ విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తుందని, జీవో నంబర్ 117 కారణంగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ సభ ఆదివారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జీవో నంబర్ 117 రద్దును రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, నేటికీ రద్దు చేయలేదన్నారు. టైం టేబుల్‌ను ప్రయోగించారని, అదేవిధంగా జీవో నంబర్ 3ను రద్దు చేయడం వల్ల మైదాన ప్రాంత ఉపాధ్యాయులు ఏజెన్సీ బదిలీలో వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి అన్నా రాము మాట్లాడుతూ మరలా పీఆర్‌సీ, ఐఆర్‌డీఏలపై పోరాటం చేయ్యడానికి సన్నద్ధం అవ్వాలని పిలుపునిచ్చారు.

బండిమాంబ... నమో..నమః




బండిమాంబ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల కోలాహలం



జాతరలో ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణ



బండిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు



జాతరలో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి సెట్టింగ్

- దారులన్నీ ఏటికొప్పాక వైపే
- కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం
- ఆకట్టుకున్న సెట్టింగులు, లైటింగ్

యలమంచిలి రూరల్ : లక్కబొమ్మలు లేదా బండిమాంబ అమ్మవారు పేరు చెప్పగానే ఠక్కున గుర్తుకొచ్చేది ఏటికొప్పాక పేరు. ఈ ప్రాంత భక్తుల కల్పవల్లిగా నిత్యం పూజలందుకుంటున్న బండిమాంబ అమ్మవారి జాతర ఆదివారం జరిగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పుసుపు, కుంకుమలు సమర్పించారు. ఏటా కార్తీకమాసంలో అమ్మవారి జాతరను జరుపుకోవడం ఆనవాయితీ. జాతర సందర్భంగా గ్రామ వీధుల్లోనూ, ఆలయ రహదారిపై ఏర్పాటు చేసిన విద్యుత్‌సెట్టింగులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్స్ కార్యక్రమాలు అలరించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యలమంచిలి రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే,వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(కన్నబాబురాజు), ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్,రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వర్రావు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా రహదారులన్నీ జనసందోహం, వాహనాల రద్దీతో కిటకిటలాడాయి. వరహానది ఒడ్డున భారీగా కాల్చిన బాణ సంచా చూసేందుకు జనం ఆసక్తి చూపారు.

ఎడ్ల బళ్ల పోటీల విజేత కేజేపురం

- ద్వితీయ స్థానంలో కోనసీమ గుమ్మిలేరు
- మామిడిపల్లిలో హోరాహోరీగా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, లెక్కల సత్యనారాయణ

దేవరాపల్లి: మామిడిపల్లిలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీల్లో కేజేపురానికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో విజేతగా నిలిచాయి. మామిడిపల్లిలో శ్రీఈరుడు మాంబ అమ్మవారి కార్తీక మాస మహోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శనను నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి 19 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన రాష్ట్ర పోటీలలో కేజె.పురంకు చెందిన శ్రీ ఆంజనేయ ఎడ్ల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కోనసీమ జిల్లాకు గుమ్మిలేరు చెందిన కోరా తేజ చౌదరి ఎడ్లు ద్వితీయ స్థానంలోను, తృతీయ స్థానంలో దేవరాపల్లికి చెందిన హేతమ్స్‌నాయుడు ఎడ్లు నిలిచాయి. తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలుకు చెందిన నిమ్మకాయల నూకరాజు ఎడ్లు నాలుగో స్థానంలోను, దేవరాపల్లికి చెందిన సత్యంనాయుడు ఎడ్లు ఐదో స్థానంలో, నర్సయ్యపేటకు చెందిన శ్రీ సిద్ధి వినాయక ఎడ్లు ఆరో స్థానంలో నిలిచాయి. పోటీలను చూడడానికి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. అనంతరం విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను ప్రదానం చేశారు. స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ కర్రి సూరినాయుడు, స్థానిక నాయకుడు లెక్కల సత్యనారాయణ, రాజునాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్, ఎంపీటీసీ సింహాచలంనాయుడు, నెక్కళ్ల వెంకటరావు, జూరెడ్డి గోవింద, లెక్కల పార్థసారథి కార్యక్రమంలో పాల్గొన్నారు.

సరుగుడులో పర్యాటకుల సందడి



తాండవ పార్కులో మహిళల సందడి



సరుగుడు జలపాతంలో సందర్శకుల జలకాలాటలు

నాతవరం: సరుగుడు జలపాతం, తాండవ రిజర్వాయర్ వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే జలపాతంలో జలకాలు ఆడేందుకు పోటీ పడ్డారు. జలపాతం సమీపంలో ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలను దర్శించుకునేందుకు ఆసక్తి చూపించారు. తాండవ రిజర్వాయర్‌పై కూడా సందర్శకులు తాకిడి పెరిగింది. తాండవ ప్రాజెక్టు దిగువున ఉన్న నల్లగొండమ్మ తల్లిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతమంతా కోలాహలంగా మారింది.

దైనందిన జీవితంలో క్రీడలు భాగం కావాలి



విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి



విజేతలతో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

- డీఐజీ గోపీనాథ్ జెట్టి
- ముగిసిన పోలీసుల వార్షిక స్పోర్ట్స్ మీట్

ఆరిలోవ: పోలీసులు దైనందిన జీవితంలో క్రీడలు, వ్యాయామాన్ని భాగం చేసుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి సూచించారు. శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి ఏదో ఒక వ్యాయామం, క్రీడను తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. నగరంలోని విశాలాక్షినగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో అనకాపల్లి జిల్లా పోలీసులకు ఈ నెల 22న ప్రారంభించిన వార్షిక స్పోర్ట్స్ మీట్–2024 ఆదివారం ముగిసింది. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతో కలసి ఆయన బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రతిరోజూ చురుగ్గా విధులు నిర్వహించడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడలు విజయవంతంగా నిర్వహించిన అధికారులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్‌రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రీవాణి, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎ.ఆర్. ఇన్‌స్పెక్టర్లు మన్మథరావు, రామకృష్ణారావు, రమణమూర్తి, సంజీవిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు నగదును తక్షణమే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

అనకాపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని డిసెంబర్ మాసంలో గాజువాక కేంద్రంగా ఉద్యమాలు చేయడం జరుగుతుందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతి రావు అన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఆదివారం రాత్రి అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ 1995లో విజయవాడ కేంద్రంగా ఏర్పాటు చేసి 8 రాష్ట్రంలో విస్తరించి, ప్రజల నుంచి రూ.వేలాది కోట్లు నగదును వసూలు చేసి, ప్రజలకు చెల్లించని కారణంగా పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. రూ.4141కోట్ల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, అగ్రిగోల్డ్ కస్టమర్లుకు పూర్తి స్థాయిలో నగదు చెల్లించలేదని అన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీ మేరకు రెండు మాసాల్లో నగదు చెల్లించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం అవుతామని ఆయన పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాయుడు, రాష్ట్ర కార్యదర్శి బి. చంద్రశేఖర్, పట్టణ గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం, అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావు, కార్యదర్శి గోపాలరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు పాల్గొన్నారు.

2 నుంచి మార్గశిర మాసోత్సవాలు

డాబాగార్డెన్స్(విశాఖ): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో డిసెంబర్ 2 నుంచి 30వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు తెలిపారు. ప్రతి గురువారం పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనాలనుకునే భక్తులు రూ.7,500 చెల్లించాలని తెలిపారు. గురువారం మినహా మిగిలిన రోజుల్లో పంచామృతాభిషేకంలో పాల్గొనదలిచే భక్తులు రూ.2,500 పూజా రుసుం చెల్లించాలన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేకానికి రూ.1,116 చెల్లించాలని, ఆయా పూజల్లో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుము ముందుగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా www. aptemples. ap. gov. in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, విశాఖపట్నం అకౌంట్ నెంబరు 0608 1001 1006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్080608లో పూజా రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు ఆ లావాదేవీ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామాను [illegible] ద్వారా పంపవచ్చని వివరించారు. దేవాలయ కౌంటర్లలోనూ టికెట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు టికెట్లు పొందవచ్చని తెలియజేశారు.

దశలవారీగా ప్రభుత్వ సంస్థలు అదానీ పరం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు

అనకాపల్లి : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత 15 ఏళ్లలో అదానీ ఆస్తులు కోట్లకు పడగెత్తడం జరిగిందని, ప్రభుత్వ ఆస్తులను, కార్యాలయాలను, కేంద్ర సంస్థలను మోదీ అదానీకి అప్పగించడం జరుగుతుందని, దీనిపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం రాత్రి విలేకరులతో ఆయన మాట్లాడారు. మోదీ దేశప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోకుండా పాలన చేస్తున్నారని విమర్శించారు. రెండు తెలుగురాష్ట్రాల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను దశల వారీగా అదానీకి అప్పగిస్తున్నారని ఆరోపించారు. మన రాష్ట్రంలో గ్యాస్, ఖనిజ సంపద ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల బడుగు, బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పాటుతుందన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల కోసం అసెంబ్లీ సమావేశంలో చర్చించాలని ఎమ్మెల్యే స్థాయి నుంచి సీఎం వరకూ వినతిపత్రాలు అందజేసినప్పటికీ పీడీఎఫ్ ఎమ్మెల్సీ తప్ప అసెంబ్లీలో అగ్రిగోల్డ్ గురించి ఒక్క ఎమ్మెల్యే కూడా మాట్లాడకపోవడం బాధాకరమైన విషయమన్నారు. ప్రధానంగా 7 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ విషయంలో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి, బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

రేకుల షెడ్ తొలగింపు పై సర్పంచ్ ఆవేదన



రేకుల షెడ్ తొలగిస్తున్న దృశ్యం

గొలుగొండ : పప్పుశెట్టిపాలెం గ్రామ సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మికి చెందిన రేకుల షెడ్ స్థానిక టీడీపీ నేతలు తొలగింపుపై ఆమె తీవ్ర ఆవేదన చెందారు. ఆమె కుటుంబ సభ్యులతో కలసి రెండు రోజులు క్రితం ఆరుణాచలం వెళ్లిన సమయంలో ఆదివారం స్థానిక టీడీపీ నేతలు షెడ్ తొలగించారని ఆమె విలేకరులకు తెలిపారు. దీనిపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఆన్‌లైన్లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. సర్వే నెంబర్ 71–5లో మూడు సెంట్లు స్థలం గతంలో కొనుగోలు చేసుకొని రేకుల షెడ్ ఏర్పాటు చేసుకున్నామని ఆదివారం దీనికి కొంత మంది తొలగించారని తెలిపారు. తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



సదస్సులో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

అల్లిపురం: అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చాలని అగ్రి గోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విశాఖ జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల సదస్సులో ఆయన మాట్లాడారు. బాధితుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, అందులో ప్రతిరోజు విచారణ జరిపించాలని, స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన అగ్రిగోల్డ్ అటాచ్‌మెంట్ ఆస్తులను రక్షించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, జిల్లా అసోసియేషన్ నాయకులు మధు, కోటేశ్వరరావు, ప్రసాద్, పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భ్రమరాంబ సహిత మల్లికార్జునికి లక్ష బిల్వార్చన



కుంకుమార్చన చేస్తున్న మహిళలు



లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

కె.కోటపాడు: మండలంలోని ఆర్లి గ్రామంలో గల స్వయంభూ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ బోళెం కృష్ణారావు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో టీటీడీ స్కీమ్ వేదపండితులు గోరుగంతుల వెంకటేశ్వరశర్మ అవధాని పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహిళలు సహస్ర కుంకుమార్చన చేశారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధనను జరిపారు. బోళెం సత్యనారాయణమూర్తి, వెంకటేష్, వరహాలబాబు, కార్తీక్, వెంకటరమణ, రాళ్ళపల్లి గణపతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్‌పై తొండాట



టెండర్లకు సై.. శంకుస్థాపనకు నై!

- జోన్ కార్యాలయ నిర్మాణానికి టెండర్లు పిలిచిన రైల్వే బోర్డు
- ప్రధాని పర్యటనలో శంకుస్థాపన వద్దంటూ తొలగించేసిన కూటమి నేతలు
- వాల్తేరు డివిజన్ పరిధిలో రూ.450 కోట్లతో మూడు ప్రాజెక్టుల శంకుస్థాపనకు ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం : దశాబ్దాల కలగా మిగిలిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై కూటమి ప్రభుత్వం తొండాట ఆడుతోంది. జోన్ ప్రధాన కార్యాలయానికి సంబంధించిన టెండర్లను రైల్వే బోర్డు ఆహ్వానించినా.. ప్రధాని మోదీ పర్యటనలో శంకుస్థాపనకు మాత్రం కూటమి సర్కారు మోకాలడ్డింది. ఈనెల 29న జరగాల్సిన జోన్ ఫౌండేషన్ స్టోన్ పనులను వాయిదా వేయాలంటూ అధికార పార్టీకి చెందిన నేతలు పట్టుబట్టడంతో మరోసారి 'జోన్'కు గ్రహణం పట్టింది. అయితే మొత్తం రూ.450 కోట్ల విలువైన రైల్వే పనులకు మాత్రం ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

నాడు శిలాఫలకం దాచేసి.. భూమి పేరుతో డ్రామాలు చేసి..

విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపింది. జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ని అదే ఏడాది చివర్లో ఇచ్చేశారు. కానీ ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. కేవలం రాజకీయ కక్షతోనే జోన్‌ని ఆపేశారు. ముందుగా 2022లో జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి డీఆర్ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న వైర్‌లెస్ కాలనీని ఎంపిక చేశారు. వైర్‌లెస్ కాలనీలో ఉన్న 13 ఎకరాల్లో 8 ఎకరాల విస్తీర్ణంలో హెడ్‌క్వార్టర్స్‌కు సంబంధించి డిజైన్లకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదముద్ర వేశారు. కాలనీని సైతం పరిశీలించారు. రూ.106 కోట్ల వ్యయంతో జోన్ ప్రధాన కార్యాలయానికి టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమయ్యారు. టెండర్లు ఖరారు చేసిన తర్వాత అగ్రిమెంట్ జరిపి.. 36 నెలల్లో భవనాన్ని పూర్తి చేయాలని రైల్వే అధికారులు భావించారు. 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారనీ.. శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. కానీ 11వ తేదీ అర్ధరాత్రి 12 గంటల తర్వాత.. హఠాత్తుగా జోన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేసేశారు. సిద్ధం చేసిన శిలాఫలకాన్ని దాచేశారు. అప్పుడు శంకుస్థాపన చేస్తే.. క్రెడిట్ అంతా అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందనే రాజకీయ కుట్రతో ఉత్తరాంధ్ర వాసుల కలలను కల్లలు చేసేశారు. తర్వాత ముంపు భూమి పేరుతో రాజకీయాలు చేసి ప్రజలను మోసం చేశారు.

ప్రధాని శంకుస్థాపన చేయనున్న ప్రాజెక్టులు

- దువ్వాడ–ఉత్తర సింహాచలం స్టేషన్ల మధ్య 3, 4 లైన్ల నిర్మాణం,
- పెందుర్తి నుంచి ఉత్తర సింహాచలం మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం
- విజయనగరం–కొత్తవలస మధ్య 4వ రైల్వే లైన్ నిర్మాణం

మరోసారి వాయిదా

ఇప్పుడు మరోసారి అదే మోసం చేసేందుకు కూటమి నేతలు సిద్ధమవుతున్నారు. ఈసారి రాజకీయ కక్షతో కాకుండా ఎన్నికల స్టంట్ కోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 29న ప్రధాని మోదీ విశాఖలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా జరగనున్నాయి. దీనికి సంబంధించి రైల్వే నుంచి కూడా నాలుగు ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించగా.. పీఎంవో వాటన్నింటినీ ఆమోదించింది. ఇందులో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ శంకుస్థాపన కార్యక్రమం కూడా ఉంది. ఈ విషయం తెలుసుకున్న కూటమి నేతలు.. జోన్ శంకుస్థాపనని వాయిదా వేయాలని పట్టుబట్టారు. జమిలి ఎన్నికల ముందు చేస్తే.. ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలమని పీఎంవో ముందు ఏకరువు పెట్టినట్లు తెలుస్తోంది. రాష్ట్ర కూటమి నేతల ఒత్తిళ్ల నేపథ్యంలో జోన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని తొలగించాలంటూ 23వ తేదీ అర్ధరాత్రి వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులకు పీఎంవో నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో మిగిలిన మూడు ప్రాజెక్టులను మాత్రమే ప్రధాని కార్యక్రమంలో పొందుపరిచారు. రైల్వే జోన్‌ను ఉత్తరాంధ్ర ప్రజల కలల ప్రాజెక్టుగా చూడకుండా కేవలం రాజకీయ లబ్ధికోసం వాడుకోవడం కూటమి నేతలకే చెల్లింది. మొత్తంగా ప్రధాని పర్యటనలో వాల్తేరు డివిజన్‌కు సంబంధించి సుమారు రూ.450 కోట్ల అంచనా వ్యయంతో 3 ప్రాజెక్టులకు శంకుస్థాపన జరగనుంది. ఇందులో దువ్వాడ–ఉత్తర సింహాచలం స్టేషన్ల మధ్య 3, 4 లైన్ల నిర్మాణం, సర్ఫేస్ లెవల్ క్రాసింగ్ ఇబ్బందులు తొలగించేలా.. పెందుర్తి నుంచి ఉత్తర సింహాచలం మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం, విజయనగరం–కొత్తవలస మధ్య 4వ రైల్వే లైన్ నిర్మాణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారని రైల్వే వర్గాలు వెల్లడించాయి.

క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి శోభాయాత్ర



అయ్యప్పస్వామి శోభాయాత్రలో మహిళా భక్తులు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి అయ్యప్ప స్వామి పంబ పీఠంలో ఆదివారం శోభాయాత్ర ఘనంగా జరిగింది. స్వామివారి పంచలోహ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, కోలాటం, తప్పెటగుళ్లు, సన్నాయి మేళం నడుమ అయ్యప్పస్వాములు, మహిళలు పట్టణంలో పుర వీధుల్లో స్వామిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పీఠం నిర్వహణ కమిటీ సభ్యులు గుమ్మాల నాగేశ్వరరావు, ఓమ్మి రాము, ముత్త శ్రీనివాసరావు, బుద్దిరెడ్డి మురళీకృష్ణ, ఉగ్గిన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

500 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కశింకోట: మండలంలోని సోమవరం గ్రామంలో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో విశాఖలోని శివాని ఆస్పత్రి వైద్యులు ఆర్.కిరణ్‌కుమార్, మనోజ్‌కుమార్, వెంకట భాస్కర్, జ్యోతి, రాహుల్ తదితరులు వైద్య సేవలు అందించారు. సుమారు 500 మంది రోగులకు వైద్యులు రక్త పరీక్షలు, ఎముకల సాంద్రత, బీపీ, సుగర్, కిడ్నీ వంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు.

శారదానగర్‌లో మద్యం దుకాణం తొలగించాలి



శారదానగర్‌లో మద్యం దుకాణం తొలగించాలంటూ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న సంఘ సభ్యులు

తుమ్మపాల: కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ప్రజా సంక్షేమం దృష్ట్యా తక్షణం తొలగించాలని శారదా సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి, మహాత్మునికి వినతి పత్రం సమర్పించారు. శారదానగర్‌లో మద్యం దుకాణాన్ని నెలకొల్పరాదంటూ పంచాయతీ ఏకగ్రీవంగా చేసిన తీర్మానాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. తక్షణమే మద్యం దుకాణాన్ని వేరొక ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు తాడి శ్రీనివాస్ చక్రవర్తి, ఆడారి శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-15, ఓ పాజిటివ్-17, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 207 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 164 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చును.

అన్నదాతల్లో తుపాను గుబులు

- మారిన వాతావరణంతో రైతులు అప్రమత్తం
- వరి చేలు భద్రపరిచేందుకు పాట్లు



కశింకోట వద్ద కోతకు సిద్ధం అవుతున్న పండిన వరి చేలు

కశింకోట: తుపాను ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతుల్లో అలజడి రేగుతోంది. ఇటీవల తుపాను ముప్పు తప్పగా.. రైతులు వరి కోతలకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మళ్లీ తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో మండలంలోని ఖరీఫ్ వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరు గాలం కష్టించి పండించిన పంట దాదాపు కోత దశకు చేరుకుంది. కొన్ని చోట్ల కోతలు కూడా కోశారు. ఈ నేపథ్యంలో తుపానుకు గాలులు వీచి వర్షాలు పడితే పంటను నష్టపోవలసి వస్తుందని మదన పడుతున్నారు. మండలంలో ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా 1360 హెక్టార్లలో ఖరీఫ్ వరి పంట వేశారు. మొదట్లో భారీ వర్షాలు కొంతమేర నష్టం కలిగించినా ఆ తర్వాత వాతావరణం అనుకూలించడంతో పంట విస్తారంగా వేశారు. కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, జమాదులపాలెం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, తాళ్లపాలెం, గొబ్బూరు, ఎఎస్ పేట, సోమవరం, చింతలపాలెం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్యుతాపురం, చెరకాం, తీడ కన్నూరుపాలెం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, సింగవరం, రామన్నపాలెం, విసన్నపేట తదితర గ్రామాల్లో వరి పంట వేశారు. చెరకు సాగు రైతులు సైతం గిట్టుబాటు కావడం లేదని వరి వైపు దృష్టి సారించారు. దీంతో సాగు విస్తీర్ణం పెరిగింది. జి.భీమవరం, అడ్డాం గ్రామాల్లో ముందుగా నాట్లు వేసిన తేలిక రకం వరి పండటంతో సుమారు పది ఎకరాల్లో తాజాగా కోతలు కూడా కోశారు. ఇక పది నుంచి నెల రోజుల్లో మిగిలిన దీర్ఘకాలిక రకాల పంట చేతికి రానుంది.

ఈ తరుణంలో భారీ వర్షాలు కురవనున్నట్లు హెచ్చరికలు రావడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాల హెచ్చరికల దృష్ట్యా పండిన వరి పంటను కోత కోయరాదని, వర్షాలు పోయాక తమ సూచనల మేరకు పంట కోసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే మరో వైపు వెన్నులో గింజకట్టె దశలోనే గింజలు రాలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీని నివారణకు అధికారులు సూచనలు అందించాలని కోరుతున్నారు.

పంట కోతకు వచ్చింది..



సుమారు ఎకరం భూమిలో వరి పంట వేశాను. ఇక పది రోజుల్లో పండి చేతికి రానుంది. భారీ వర్షాలు కురవనున్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటకు ముప్పు కలుగుతుందోనని ఆందోళనగా ఉంది. కుటుంబానికి జీవనాధారంగా నిలిచే వరి పంటకు తుపాను నష్టం కలిగించకుండా గట్టెక్కాలని దైవాన్ని కోరుకుంటున్నాం.

– వేగి సూరిఅప్పారావు, వరి రైతు, కశింకోట

గింజలు రాలిపోతున్నాయి..



వరి గింజలు కట్టె దశలోనే వెన్ను నుంచి కిందకు రాలిపోతున్నాయి. దీనివల్ల పంట దిగుబడి తగ్గి నష్టం కలగనుంది. దీని దృష్ట్యా అధికారులు పంటను పరిశీలించి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలి. సరైన నివారణ మార్గాలు సూచించాలి.

– వేగి సత్యనారాయణ, రైతు, కశింకోట

కోతలు కోయొద్దు..

ఈ నెల 25, 26 తేదీల్లో భారీ వర్షాల కురవనున్నట్లు హెచ్చరికలు ఉన్న దృష్ట్యా పండిన వరి పంట కోతలు కోయకుండా వాయిదా వేసుకోవాలి. కోత కోసిన పంటను సత్వరమే కుప్పలు పెట్టుకోవాలి. వర్షాల వల్ల తడిచి నష్టం కలగనుంది. ఈ విషయాన్ని గమనించాలి. మండలంలో రెల్ల రాల్చు పురుగు ప్రభావం కనిపిస్తోంది. దీని నివారణకు క్లోరంట్రానిలిప్రోల్ 60 మిల్లీలీటర్లు గానీ, ఇమేక్టిన్ బెంజాఎట్ 80 గ్రాములు గానీ, ఎకరా వరి దుబ్బు మొదళ్లలో చేరేటట్లు సాయంత్రం పూట పిచికారీ చేసుకోవాలి. కంకినల్లి నివారణకు బైపెంట్రిన్ 500 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారీ చేయాలి.

– ఎం.స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

బొజ్జన్న కొండకు సందర్శకుల తాకిడి



బొజ్జన్నకొండకు తరలివచ్చిన సందర్శకులు

తుమ్మపాల: కార్తీక వన సమారాధనలో భాగంగా ఆదివారం బొజ్జన్నకొండకు అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. బొజ్జన్నకొండపై గల బౌద్ధ మందిరంలో బుద్ధుని విగ్రహం, స్థూపాలకు మహిళలు దీపారాధన చేశారు. బౌద్ధరామాలు, చైత్యాలను కొండపై పరిసరాలను సందర్శించి ఆహ్లాద వాతవరణంలో రోజంతా సేదతీరారు. చుట్టూ వరి పొలాలతో పచ్చని పచ్చికబయళ్ల మధ్య ఉన్న బొజ్జన్నకొండతో పాటు లింగాల కొండను సందర్శించారు. సెల్‌ఫోన్‌లతో ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. జిల్లాలో పలు పాఠశాలల విద్యార్థులు పిక్నిక్‌లకు తరలివచ్చి రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు



కశింకోటలో అన్నదాతలుగా రాణిస్తున్న పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న 1988-89 బ్యాచ్ విద్యార్థులు



జీవీఎంసీ హైస్కూల్ ఆవరణలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు



సమావేశమైన కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు 1973-74 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

అనకాపల్లి: ఏరా మిత్రమా బాగున్నావా.. ఎక్కడున్నావు.. ఏమి చేస్తున్నావు.... చిన్ననాటి చిలిపి చేష్టలు నేటికీ చేస్తున్నావా.. ఎన్ని సంవత్సరాలు తరువాత చూస్తున్నాను. అంటూ స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1989-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. పూర్వ విద్యార్థుల సహకారంతో హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని అప్పటి విద్యనేర్పిన ఉపాధ్యాయులు సత్యం, నర్సింగరావు ఆవిష్కరించారు. అనంతరం చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి, మెమొంటోలు అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక

స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1998-99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా గంటా సముద్రాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్కూల్ ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షునిగా ఆదిలక్ష్మి, కార్యదర్శిగా శంకర్, సహాయ కార్యదర్శిగా జి.సుధారాణి, కోశాధికారిగా ఉరికిటి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

50 ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు

కశింకోట: స్థానిక డీపీఎన్ హైస్కూల్‌లో 50 ఏళ్ల క్రితం చదివిన విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. ఇందుకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న కల్యాణ మండపం వేదికైంది. ఇక్కడ 1973-74 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ప్రత్యేకంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మిత్రులను కలుసుకొని ఆనందపరవశులయ్యారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమతో పాటు చదివి తల్లిదండ్రులు లేకుండా పేదరికాన్ని అనుభవిస్తున్న పేద విద్యార్థి జి.రఘుమణికి గతేడాది నుంచి నెలకు రూ.3 వేలు వంతున ఆర్థిక సహాయాన్ని అందజేసి పూర్వ విద్యార్థులు అండగా నిలుస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎప్పటిలాగే ఈ సహాయాన్ని కొనసాగించాలని, పేదలకు తోడ్పాటు అందించాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లో పని చేసిన ప్రొఫెసర్ కైలాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య నియమాలు, నడవడిక గురించి వివరించారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ ఉజ్జి సూర్యమల్లేశ్వరరావు, కోటేశ్వరరావు, ధర్మారావు, మాధవి, ఉమా శంకరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో 1988-89 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. స్థానిక శారదానది అవతల ఉన్న తోటలో వారు సమావేశమయ్యారు. పరస్పరం పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమ బ్యాచ్‌లో కేవలం వ్యవసాయమే జీవనాధారంగా మొదటి నుంచి కాలం గడుపుతున్న కాండ్రేగుల పడమటయ్య, బొబ్బరి పడమటయ్యలను సత్కరించారు. పేదలకు అండగా నిలవాలని నిర్ణయించారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష



స్వాములకు భిక్ష వడ్డిస్తున్న మలసాల కుమార్‌రాజా

తుమ్మపాల: పట్టణంలో గవరపాలెం శ్రీగౌరీ సంఘంలో అయ్యప్ప స్వాములకు ఆదివారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.వి.సంతోష్ ఆధ్వర్యంలో భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పార్టీ ముఖ్య నాయకుడు మలసాల కుమార్‌రాజా హాజరై అయ్యప్ప భక్తులకు భిక్ష వడ్డించారు. ఈ కార్యక్రమంలో పార్టీ 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ నాయకులు పెంటకోట శ్రీను, సూరిశెట్టి సత్తిబాబు, దండా జ్ఞానదీప్, రాజు, పిళ్లా రాజు, దాడి కుమార్, వెలుగుల కృష్ణ చైతన్య, కాండ్రేగుల శ్యామ్ పాల్గొన్నారు.

20 మద్యం బ్యాటిళ్ల స్వాధీనం

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల-వెంకుపాలెం రహదారిలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా మెట్టపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన ముప్పల స్వాతి నుంచి 20 మద్యం బ్యాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆదివారం చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి 'బోయిన'కు అభినందనలు

కశింకోట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బోయిన భానుమూర్తిని కశింకోటకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ నాయకులు కలిసి ఆదివారం అభినందనలు తెలిపారు. సన్నేడ గజ్జాలు, ఆవాల రామారావు, వాయిబోయిన రాజు, మాదేపు నాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాళ్ల సత్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

స్మార్టుమీటర్లు వద్దే వద్దు..



కొడవటిపూడిలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్న సీపీఎం నాయకులు

కోటవురట్ల: రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.36 వేల కోట్ల భారాన్ని మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం కావడం దారుణమని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.సత్యనారాయణ దుయ్యబట్టారు. కొడవటిపూడిలో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పేదల బతుకులను వీధిన పడేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఇప్పుడు పెనుభారం వేయడమే కాకుండా స్మార్ట్ మీటర్లు బిగించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే ముందుగానే రీచార్జ్ చేసుకోవాలని, ఇది పేదలను అంధకారంలోకి నెట్టేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు బిగించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.దేవిడ్‌రాజ్, కన్నయ్య, సూరిబాబు, రమణ, తాతబ్బాయి. తల్లిబాబు, రాజారత్నం పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు శంకరరావు, గంటా శ్రీరామ్

తుమ్మపాల: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రతరం చేస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గంటా శ్రీరామ్ విమర్శించారు. పట్టణంలో ఆదివారం జరిగిన జీవీఎంసీ మున్సిపల్ వర్కర్ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న కేంద్ర కార్మిక సంఘాలు కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో జరగనున్న మహాధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్ని సవరించి లేబర్ కోడ్స్ కింద మార్చిందని, కనీస వేతనాలు అమలు కాకుండా చట్టాలను మార్చడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పేరుతో ఏళ్ల తరబడి పనిచేసినా పర్మినెంట్ చేయడం లేదని ధ్వజమెత్తారు. కనీస వేతన రూ.26 వేలు, ఉద్యోగ భద్రత కల్పించడం, తదితర అంశాల డిమాండ్లతో దేశ వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాల్లో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.అజయ్, ఓం శివ, బొమ్మల నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

భూగర్భ శివాలయంలో అభిషేకాలకు ఏర్పాట్లు



భూగర్భ శివాలయంలో శివలింగాలు

నాతవరం : కార్తీకమాసం ఆఖరు సోమవారం కావడంతో చిక్కుడుపాలెంలో గల శ్రీశివ శక్తి క్షేత్రం శివాలయంలో స్వహస్తాలతో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెంలో భూగర్భంలో శివాలయం నిర్మించారు. ఇక్కడ అన్ని రకాలు శివలింగాలు ఏర్పాటు చేశారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో భక్తులు స్వహస్తాలతో శివలింగాలకు అభిషేకాలు పూజలు చేసేందుకు వేదపండితులు శ్రీ సీతారామ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా వెదురుపల్లి గ్రామంలో రేటమ్మ కొండపై వెలసిన శివ పార్వతుల ఆలయంలో కూడా సోమవారం పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కనకదుర్గమ్మ ఆలయ ఛైర్మన్‌గా 'కోటిపల్లి'



కోటిపల్లి వెంకట రమణ కిషోర్‌ను సత్కరిస్తున్న ఎన్టీఆర్ క్రీడా మైదానం వాకర్స్

అనకాపల్లి: మండలంలో సత్యనారాయణపురం పంచాయతీలోని కనకదుర్గ అమ్మవారి ఆలయ ఛైర్మన్‌గా కోటిపల్లి వెంకట రమణ కిషోర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు అమ్మవారిని కిషోర్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొత్త ఛైర్మన్‌తో ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ ఛైర్మన్ పదవి రెండేళ్ల పాటు ఉంటుందన్నారు. అనంతరం కోటిపల్లి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు సహకారంతో శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. భక్తులకు అన్నదాన భవన నిర్మాణం, అమ్మవారి గుడి నుంచి మెయిన్ రహదారి వరకూ భక్తుల సౌకర్యార్థం షెడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. అంతకు ముందు అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడా మైదానం వాకర్స్ సభ్యులు, వివిధ వర్గాల ప్రజలు నూతన ఛైర్మన్ కిషోర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బోయిన రమణాజీ, ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి ధర్మాచార్యులు, అన్నదాన కమిటీ ఛైర్మన్ దొడ్డ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ క్రీడా మైదానం వాకర్స్ గౌరవాధ్యక్షుడు రాజాన అప్పారావు, కార్యదర్శి బుద్ధ నాయుడు, కోశాధికారి పాలమరశెట్టి ఓంనమః శివాయ, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుల నిర్వహణతో పెరిగిన అఘాయిత్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి రావి లక్ష్మి

అనకాపల్లి: రాష్ట్రంలో విచ్చల విడిగా మద్యం బెల్టు దుకాణాలు పెట్టి అమ్మకాలు జరపడంతో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా సహాయ కార్యదర్శులు రావి లక్ష్మి, గంటా సుభాషిణి అన్నారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా మద్యం పాలసీ తీసుకువచ్చిందని ఆరోపించారు. దీంతో వీధి వీధికి, గ్రామ గ్రామాన మద్యం అమ్మకాలు సాగడంతో మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. విశాఖలో లా విద్యార్థిపై నలుగురు లైంగిక దాడికి పాల్పడ్డారని, ఇలాంటి సంఘటనలు అనకాపల్లి జిల్లాలో జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం ముందుగా చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతుందని వారు ఆరోపించారు. మద్యం నిషేధానికి దశలు వారీగా ఉద్యమాలు చేస్తామన్నారు.

బురదలో కూరుకుపోయిన లారీ



బొజ్జన్నకొండ రోడ్డులో క్రేన్ సహాయంతో బయటకు తీస్తున్న లారీ



భారీ లోడులతో నిలిచిపోయిన క్వారీ ట్రక్కులు

తుమ్మపాల: మండలంలో శంకరం గ్రామం బొజ్జన్నకొండ రహదారిలో బురదలో ఆదివారం ఓ లారీ కూరుకుపోయింది. దీంతో అధిక సంఖ్యలో క్వారీ ట్రక్కులు, సందర్శకుల వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు చేరుకుని లారీని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ గంటల తరబడి క్లియర్ కాలేదు. నిత్యం వందల సంఖ్యలో క్వారీ ట్రక్కులు రాకపోకలు జరిగే ఈ రోడ్డులో ఆదివారం బొజ్జన్నకొండ సందర్శకుల వాహనాల తాకిడితో మరింత రద్దీ ఏర్పడింది. ఓ పక్క సందర్శకుల వాహనాలు, క్వారీ ట్రక్కుల రాకపోకలకు జాతీయ రహదారి వద్ద ఇరుకైన మార్గం ఉండడంతో కేవలం ఒక వాహనం మాత్రమే రాకపోకలు చేసేందుకు అవకాశం ఉంది. దీంతో ట్రక్కులు అధిక సంఖ్యలో నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పర్యాటక అభివృద్ధి కోసం వేసిన రోడ్డులో విపరీతంగా క్వారీ వాహనాలు తిరగడంతో పాడైపోతుందని, భారీ వాహనాలు రాకపోకలను కట్టడి చేసి బొజ్జన్నకొండ పరిసరాలను కాపాడాలని సందర్శకులు కోరుతున్నారు.

పంచాయతీ భవనానికి శంకుస్థాపన నేడు

అనకాపల్లి: మండలంలో బట్టపూడి పంచాయతీ భవన నిర్మాణానికి రూ.15లక్షల ఎంపీపీ నిధులతో సోమవారం పనులు ప్రారంభిస్తున్నట్లు బట్టపడి ఎంపీటీసీ ముమ్మిన అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పంచాయతీ భవనం శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో నూతన భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నామన్నారు.